# సగటు మనిషి

సాయం సమయం ఆరుగంటలు కావస్తోంది. వాతావరణం మనసుకు ఆహ్లాదాన్ని కలిగిస్తోంది. అప్పుడే డ్యూటీకొచ్చిన అగంతకుడెవరో చీకట్లో నల్ల దుప్పట్లు పరచుకుంటూ పోతున్నాడు.

పార్కులో ఓ మూలగా వున్న బెంచీపై కూర్చున్నాడు శ్రీకాంత్. కొంచెం గడ్డం పెరిగి వుంది. పెరిగిన గడ్డం మాసింది చొక్కాలాగానే. బోలెడంత టెన్షన్ హృదయ కవాటాల్లో మరింత దిగులు మొహంలో.

-బెండపూడి రమేష్‌బాబు



అతనికి ఇంటికి పోవాలనిపించడంలేదు ఇంటికి పోతే ఏం జరుగుతుందో అతనికి ముందే తెలుసు కాబట్టి. ఆ సమస్యే అతన్ని కదలనివ్వడం లేదు. ఈ సమస్య నుండి తను బయపడగలనా లేదా? అనే అనుమానం వస్తేనే వెన్నులోంచి వణుకు బయలుదేరుతోంది.


ఇన్నాళ్లూ తను ప్రాణంకన్నా ఎక్కువగా గౌరవించే తన గౌరవ మర్యాదలు మంటకలసిపోయే రోజులు దగ్గరపడ్డాయి. బంధువుల్లో తనెంత చులకన అయిపోతాడో తలుచుకుంటేనే భయంగా ఉందతనికి.

అదేమన్నా రూపాయి అర్ధరూపాయితో తీరే సమస్యా? కానేకాదు. పాతికవేలుతోగానీ పరిష్కారం కానీ సమస్య. ఇప్పటికిప్పుడు అంత డబ్బు తనకెవరిస్తారు? అది జరిగే పనేనా? అప్పటికే తనకి తెలిసినవాళ్లందర్నీ అడిగి చూసాడు. పదో పరకో అయితే సర్దగలమేగానీ అంత డబ్బు సర్దడం తమవల్ల కాదన్నారు. ఏం చేయాలో? ఈ సమస్య నుండి ఎలా బయటపడేది అర్థం కావడంలేదు అతనికి.



## ఆల్ ది బెస్ట్!

'శివాజీ' తర్వాత ఒక్కటంటే ఒక్క హిట్టూ శ్రియాకు. ఇటీవల వచ్చిన హిందీ సినిమా 'ఏక్' కూడా దారుణంగా ఫెయిలయింది. ఇప్పుడు శ్రియ ఆశలన్నీ తమిళ సినిమా 'మల్లన్న'మీదే వున్నాయి. త్వరలో ప్రేక్షకుల ముందుకి రాబోతున్న 'మల్లన్న' శ్రియకి ఏం మేలు చేస్తాడో చూడాలి! సినిమా సూపర్‌హిట్ అయి, తిరిగి పూర్వవైభవం పొందాలనే ఆరాటంలో వుంది శ్రియ. ఆల్ ది బెస్ట్ శ్రియా!




శ్రీకాంత్ ఓ చిరుద్యోగి. అదీ అతను తన ప్రతిభా పాటవాలతో తెచ్చుకున్నదేంకాదు. అతని తండ్రి హఠాన్మరణం చెందడంతో వచ్చిన ఉద్యోగం అది. ఇంకా ప్రొబెషనరీ పీరియడ్ పూర్తి కాలేదు. నిన్న సాయంకాలం జరిగిన సంఘటన అతని కళ్లముందు కదలాడింది.

ఆఫీస్ పని పూర్తయ్యాక ఇంటికి చేరుకున్నాడు శ్రీకాంత్. భార్య నందినీ ఇచ్చిన నీళ్ల తాగి కాస్త సేదతీరాడు. తల్లి టీవీలో వస్తున్న రామాయణం సీరియల్ చూస్తోంది. అత్తగారికీ, తన భర్తకీ కాఫీ తెచ్చి ఇచ్చింది నందినీ.

"శ్రీకాంత్! ఇంకో పదిరోజుల్లో మీ నాన్నగారి సంవత్సరీకాలు వస్తున్నాయి... గుర్తుందా?'' అంది.

తల్లి మాట వినేసరికి గొంతులో పచ్చివెలక్కాయ పడినట్లయింది శ్రీకాంత్‌కు.

"అప్పుడే నాన్నగారి సంవత్సరీకాలు వచ్చాయా?'' అన్నాడు చేతిలో వున్న కాఫీ కప్పు కింద పెడుతూ అప్రయత్నంగా.

నందినీ హాలు గుమ్మం దగ్గర నిలబడి వాళ్ల సంభాషణ వింటోంది.

"నేను చెప్పింది అర్థమయిందా శ్రీకాంత్'' అంది రెట్టించి గట్టిగా అడిగిందామె.

"ఊ... అర్థమయిందిలే అమ్మా''

"ఈ కార్యక్రమంపై కాస్త శ్రద్ధ పెట్టు. నీవు పెళ్లాం పిల్లలతో హాయిగా కాపురం చేసుకుంటున్నావంటే పోతూ పోతూ ఆయన చూపించిన దారేరా? లేకపోతే ఇప్పుడున్న పరిస్థితుల్లో ఉద్యోగాలు వచ్చేలా ఉన్నాయా? చెప్పరా?''

"నీవు అన్నదాంట్లో నిజం వుంది. ఇంతకీ ఎంత ఖర్చవుతుందో కనుక్కున్నావా?'' అన్నాడు తల్లిని ఉద్దేశించి.

"ఎంత హీనపక్షంగా వేసుకున్నా పాతికవేలు అవుతుందిట. పొద్దుట శివాలయంలో వున్న పంతులుగార్ని అడిగితే చెప్పారు'' అంది.

"పాతికవేలా?'' అన్నాడు ఆశ్చర్యపోతూ.

"ఏరా! అంతలా నోరెళ్లబెట్టావు పాతికవేలా అంటూ?'' అంది.

"అదికాదమ్మా... అంత డబ్బు ఎలా సమకూర్చుకోవాలో అర్థం కావడంలేదు.''

"శ్రీకాంత్! నువ్వేం చేస్తావో ఎలా చేస్తావో నాకు తెలియదు. పదిమందిలో పరువు పోకుండా చూడు'' అంది.

"సరే అలాగే చూస్తా'' అంటూ డ్రెస్ మార్చుకోవడానికి గదిలోకి వెళ్లాడు.

★★★

అప్పట్నుంచి డబ్బు వేటలో పడ్డాడు. ఎక్కడా పైసా పుట్టలేదు. ఈ కార్యక్రమం పూర్తి చేయడం అంటే తనకి శక్తికి మించిన బరువు అని తెల్సు. కానీ తప్పదు. ఎందుకంటే ఆచారాల ఇనుపచట్రంలో ఇరుక్కుపోయిన ఓ మనిషిని కనుక.

"సార్! పార్క్ టైం అయిపోయింది ఇక లేస్తారా'' అన్న వాచ్‌మెన్ పిలుపుతో స్పృహలోకి వచ్చాడు శ్రీకాంత్.

కాళ్లీడ్చుకుంటూ ఇంటి మొహం పట్టాడు తను దిగులుగా.

కార్యక్రమం దగ్గర పడేకొద్దీ అతన్లో టెన్షన్ పెరిగిపోసాగింది. తల్లి నుండి ఎదురయ్యే ప్రశ్నల పరంపర వుక్కిరిబిక్కిరి చేస్తోంది. ఇంటికి వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి దాపురించింది.

ఎప్పటిప్పుడు ఏదో ఒక కారణం చెబుతూ నెట్టుకొస్తున్నాడు. అతనికి తెల్సు రేపైనా నిజం దాగదని... అతని తల్లికి తెలియదు ఏదో ఒకటి చెప్పి నెట్టుకొస్తున్నాడనీ.

కానీ జరుగుతున్నది నందినికి తెలుసని ఇద్దరికీ తెలీదు. రాత్రి భోజనాలయ్యాక పడుకున్నాడన్నమాటేగానీ శ్రీకాంత్‌కి నిద్ర రావడంలేదు. పక్కపై అటూ ఇటూ కదలసాగాడు.

భర్తకి నిద్ర పట్టని కారణం ఏమిటో నందినికి తెలుసు. భర్త ఆవేదన చూస్తుంటే ఆమెకి దుఃఖం ముంచుకొస్తోంది బాధతో.

"ఏమండీ! నిద్ర రావడంలేదు కదూ?"

"ఊ"

"మీరు అత్తయ్యగారికి అబద్ధాలు చెబుతున్నారుకదూ"

ఉలిక్కిపడ్డాడు. ఉన్న కాస్త మత్తు వదిలిపోయింది.

"నిజం దాచడమా? దేని గురించి నువ్వు మాట్లాడేది?" తడబడ్డాడు.

"మామయ్యగారి సంవత్సరీకాల గురించి" స్థిమితంగా అంది.

అతనికేం జవాబు చెప్పాలో తెలియలేదు. జవాబు చెప్పలేని ప్రశ్న అది. దానికి అతనేం జవాబు చెబుతాడు. అందుకే మౌనంగా ఉండిపోయాడు.

"డబ్బు కోసం మీరెంత ఇబ్బంది పడుతున్నారో నాకు తెలుస్తూనే వుంది. ఆ సమస్య మీ గుండెల్ని ఎలా కాల్చేస్తుందీ తెలుస్తూనే వుంది."

ఇక నందినీ దగ్గర దాచిపెట్టడం అవివేకం అనిపించింది. ఉన్నది ఉన్నట్లు చెప్పాడు.

ఓ ఫ్రెండ్ తను సర్దుతానులే అని హామీ ఇవ్వడంతో ధైర్యం చేసి కార్డులు కూడా పోస్టు చేసాననీ, చివరకు డబ్బు సర్దలేక పోతున్నందుకు క్షమించమని కోరాడనీ, రేపు బంధువులొస్తే ఏం చెప్పాలో అర్థం కావడంలేదనీ చెప్పాడు.

అతని గొంతులో జీర స్పష్టంగా అర్థమవుతోంది నందినికి. మౌనంగా అతని మాటలు విందామె.

చాలాసేపటివరకూ మాట్లాడుకుని పడుకున్నారిద్దరూ. నిద్ర పట్టక శ్రీకాంత్, ఆలోచనలతో నందిని చెరోవైపు తిరిగి పడుకున్నారు.

***

కాస్త ఆలస్యంగా ఇంటికి చేరిన శ్రీకాంత్‌కి ఇంట్లో పరిస్థితిని చూసి అవాక్కయ్యాడు. ఇంట్లో నిండుగా సరుకులు వచ్చి చేరాయి.

తల్లి పంతులుగారితో జరగబోయే కార్యక్రమం గురించి మాట్లాడుతోంది. శ్రీకాంత్‌కి అంతా అయోమయంగా ఉంది.

పంతులుగారు నందిని ఇచ్చిన అడ్వాన్స్ తీసుకుని వెళ్లాడు. వంటింట్లో ఏదో పని చేసుకుంటున్న నందిని దగ్గరకు వెళ్లాడు శ్రీకాంత్.

"నందినీ నిజం చెప్పు. ఈ సరుకులకీ, ఆ పంతులుగారికీ ఇవ్వడానికి డబ్బులు ఎలా వచ్చాయి? నీగ్గానీ తెలిసినవాళ్లెవ్వరి దగ్గరైనా అప్పు తెచ్చావా?"

"మీకు తెలియకుండా ఈ ఊళ్లో నాకు తెలిసినవాళ్లు ఎవరున్నారండీ?"

"మరి డబ్బెలా వచ్చింది? ఎవరు ఇచ్చారు?" అన్నాడు.

"నా గొలుసు తాకట్టు పెట్టాను"

"గొలుసు తాకట్టు పెట్టావా?" అన్నాడు గిల్టీగా ఫీలవుతూ.

"ఏవండీ... నేను చెప్పేది వినండి. డబ్బులు వచ్చిన రోజు నగ తాకట్టు విడిపించవచ్చు. రేపు బంధువులందరూ వచ్చి కార్యక్రమం కాస్తా లేదని తెలిస్తే ఎంత పరువు పోతుందో ఆలోచించండి"


ఆమె చెప్పేది నూటికి నూరుపాళ్లు నిజమే అనిపించింది.

"నందినీ! నువ్వు చెప్పేది నిజమే. కానీ ఇలా చేయడం నా మనసును కలవరపెడుతోంది" అన్నాడు బాధగా.

"ఈ కార్యక్రమం అనుకున్నప్పటి నుంచీ మీరు పడే టెన్షన్, బాధ చూస్తుంటే ఒక్కసారి ఏడుపొచ్చేది నాకు. మన పరిస్థితులు అన్నీ తెలిసిన అత్తయ్యగారే 'మీరు హాయిగా పెళ్లాం పిల్లలతో కాపురం చేసుకుంటున్నారంటే పోయిన మామయ్యగారు చూపిన దారే' అని అనలేదా? ఎన్నిసార్లు తన భర్త గుణగణాల్ని పొగడ్తలతో ముంచెత్తడంలేదా? అది తప్పు అని నేను అనను. నాకు మాత్రం మీపై అలాంటి భావాలు వుండవా? ఉండకూడదా? చెప్పండి. మీరు కలత చెందడం నేను చూడలేక ఈ పని చేసాను. మీ బాధల్లో భాగస్వామి అయ్యే హక్కు నాకు తాళి కట్టిననాడే మీరు నాకు కట్టబెట్టారు. అందుకే ఈ పని చేసాను. మీకు తెలియకుండా ఈ పని చేసినందుకు మన్నించండి" అంది నందిని.

భార్యకు తనపైగల అభిమానానికి ముగ్ధుడయ్యాడు శ్రీకాంత్. భార్య నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు తేలికపడ్డ మనస్సుతో ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుంటూ ప్రేమగా నిమిరాడు.

★



## విమానం దిగిన రైలు

ఢిల్లీ మెట్రోఫేజ్-2 కోసం 424 బోగీలలో మొదటి 36 బోగీలు జర్మనీలో తయారవుతున్నాయి. తక్కినవాటిని అదే కంపెనీ ప్లాంటులో వదోదరాలో తయారు చేస్తున్నారు. మామూలుగా 22 నెలలు పడుతుంది ఒక బోగీ తయారు చేయడానికి. 18 నెలల రికార్డు సమయంలో తయారైన మొదటి బోగీని ఇటీవల ఎఎన్-124 విమానంలో ఢిల్లీకి చేర్చారు. ఒక ట్రైన్ సెట్‌ని విమానంలో ఢిల్లీకి తీసుకురావడానికి అయిన ఖర్చు 9 కోట్లు. ఈ బోగీలను బయో డిగ్రీ డబుల్ మెటీరియల్‌తో తయారు చేసారు. ఇది పర్యావరణానికి ఎంతో మేలు. శబ్ద కాలుష్యం తక్కువ. అత్యంత ఆధునిక బ్రేకులతో అతి సురక్షితమైన బోగీలివి.

-తటవర్తి

